తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
సోమవారం
07 సెప్టెంబర్ 2026
సంపుటి 03
సంచిక 329
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

## బాలికను కిడ్నాప్ చేసి సామూహిక అత్యాచారం

- బీహార్‌లోని ఔరంగాబాద్‌లో దారుణ ఘటన
- బస్సు కోసం వేచి చూస్తుండగా అపహరణ
- నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు



ఔరంగాబాద్ (బీహార్), సెప్టెంబర్ 6, బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ జిల్లాలో ఓ బాలికపై జరిగిన కిడ్నాప్, సామూహిక అత్యాచార ఘటన తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం, అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లి, సోదరిని చూసేందుకు నగరానికి వెళ్లేందుకు బాధిత బాలిక ఇంటి నుంచి బయలుదేరింది. బస్సు కోసం రోడ్డుపై వేచి చూస్తున్న సమయంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. సంఘటన వెలుగులోకి రావడంతో స్థానికంగా

➤ మిగతా 2వ పేజిలో..



## ప్రాణాలకు ముప్పుగా డీజే సౌండ్స్

- వేడుకల్లో అధిక శబ్దాలు ప్రమాదకరం
- డ్యాన్స్ చేస్తూ కుప్పకూలుతున్న యువత
- కోస్గిలో విద్యార్థి ఆకస్మిక మృతి కలకలం
- శబ్ద కాలుష్యంపై నిపుణుల హెచ్చరిక

డెస్క్, సెప్టెంబర్ 6, పెళ్లిళ్లు, ఊరేగింపులు, పండుగలు, శుభకార్యాలు వంటి వేడుకల్లో డీజేల వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. అయితే ఆనందాన్ని పంచాల్సిన ఈ వేడుకలు కొన్ని సందర్భాల్లో విషాదాలకు కారణమవుతున్నాయి. అధిక శబ్దాలతో మోగే డీజేలు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా యువత గంటల తరబడి భారీ శబ్దాల మధ్య డ్యాన్స్ చేయడం వల్ల శారీరక, మానసిక సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొంటున్నారు. ఇటీవలి కాలంలో డీజే కార్యక్రమాల్లో పాల్గొంటూ అకస్మాత్తుగా కుప్పకూలిపోయి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. కొద్దిసేపటి క్రితం వరకు ఉత్సాహంగా నృత్యాలు చేసిన వ్యక్తులు ఒక్కసారిగా అపస్మారక స్థితికి చేరుకుని

➤ మిగతా 2వ పేజిలో..

## ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్ రాజీనామా చేయాలి: మహేష్ కుమార్ గౌడ్



- ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వంగా కాంగ్రెస్ ముందుకు సాగుతోందని వెల్లడి
- అసెంబ్లీకి హాజరుకాకుండా ప్రతిపక్ష హోదాను అపహాస్యం చేస్తున్నారని విమర్శ
- రెండు సంవత్సరాల్లో భారీ పెట్టుబడులు, వేలాది ఉద్యోగాలు కల్పించామని స్పష్టం
- కుల సర్వేతో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని వ్యాఖ్య

హైదరాబాద్, సెప్టెంబర్ 6, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష నాయకుడి పదవి అత్యంత బాధ్యతాయుతమైనదని, అలాంటి హోదాలో ఉన్న వ్యక్తి ప్రజల సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అయితే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి దూరంగా ఉంటూ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. ప్రజా సమస్యలపై స్పందించకుండా ప్రతిపక్ష నాయకుడి హోదాను అపహాస్యం చేస్తున్నారని ఆరోపిస్తూ, ఆ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్

➤ మిగతా 2వ పేజిలో..

## 5 రోజులపాటు వర్షాకాల సమావేశాలు!

హైదరాబాద్, సెప్టెంబరు 6 తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు ప్రశ్నోత్తరాలతో శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తర్వాత సభ వాయిదా పడనుంది. అనంతరం స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన జరిగే బీఏసీ సమావేశంలో.. వర్షాకాల శాసనభ సమావేశాల ఎజెండాను ఖరారు చేస్తారు.



## మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: కవిత

- బంజారాహిల్స్‌లో మీడియాతో మాట్లాడిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు
- సోషల్ మీడియా ట్రోలింగ్‌పై డీజీపీ వైఖరిని ప్రశ్నించిన కవిత
- ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్
- అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేయాలని ముఖ్యమంత్రిని కోరిన టీఆర్ఎస్ అధినేత్రి

➤ 2వ పేజిలో..

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన అట్టర్ ఫ్లాప్: కేసీఆర్

- ఎర్రవల్లిలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం
- అసెంబ్లీ వ్యూహాలపై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం
- ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపు
- జలాలు, రైతు సమస్యలపై పోరాటం ఉధృతం చేయాలని సూచన






సిద్దిపేట, సెప్టెంబర్ 6,కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విమర్శించారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో ఆయన అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ప్రజా సమస్యలపై మరింత దూకుడుగా పోరాడాలని కేసీఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన కేసీఆర్, తమ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందనే భయంతో కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో పాలన సరిగా నిర్వహించలేకపోతున్న ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో వ్యక్తిగత విమర్శలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపిస్తూ, ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య వేదికలను రాజకీయ ఆరోపణలకు ఉపయోగించడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని రైతులు, సాగునీటి సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేసీఆర్ ఆరోపించారు. కృష్ణా, గోదావరి జలాల అంశంపై బీఆర్ఎస్ సభ్యులు ఉధృతంగా పోరాడాలని సూచించారు. రైతులకు అవసరమైన సాగునీరు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ అంశాన్ని అసెంబ్లీలో బలంగా ప్రస్తావించాలని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం



## ఈజిప్టులో భారత వైమానిక దళం 'సారంగ్' విన్యాసాలు

- ఎల్ అలమైన్ అంతర్జాతీయ వైమానిక ప్రదర్శనలో పాల్గొననున్న బృందం
- ప్రపంచంలోనే ఐదు హెలికాప్టర్లతో విన్యాసాలు చేసే ఏకైక జట్టు
- స్వదేశీ ధ్రువ్ హెలికాప్టర్లతో అద్భుత ప్రదర్శనలు
- భారత్-ఈజిప్ట్ రక్షణ సంబంధాలకు మరో మైలురాయి

2వ పేజిలో..

## నీలాకాశం కోసం స్వచ్ఛమైన గాలి అవసరం

- స్వచ్ఛమైన గాలి దినోత్సవం ఆవిర్భావం
- పెరుగుతున్న గాలి కాలుష్యం
- ఆరోగ్యంపై ప్రభావాలు
- పట్టణీకరణ, పరిశ్రమల సవాళ్లు
- సమిష్టి కృషితోనే పరిష్కారం

➤ 2వ పేజిలో..

## మురికి కూపం నుంచి జలకళ వరకు.. ఉప్పల్ నల్లచెరువుకు కొత్త రూపు

- రూపురేఖలు మార్చుకున్న ఉప్పల్ నల్లచెరువు
- నెలాఖరులోపు ప్రజలకు అందుబాటులోకి
- చెరువుల అభివృద్ధి పనులపై హైడ్రా దృష్టి
- తమ్మిడికుంట, సున్నం చెరువులను పరిశీలించిన కమిషనర్



హైదరాబాద్, సెప్టెంబర్ 6, నగరంలోని చెరువుల అభివృద్ధికి హైడ్రా చేపడుతున్న

➤ 2వ పేజిలో..

## ప్రాణాలకు ముప్పుగా డీజే సౌండ్స్

మరణించడం కుటుంబాలను విషాదంలో ముంచేస్తోంది. ఈ సంఘటనలు సమాజంలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. తాజాగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి ప్రాంతంలో జరిగిన ఓ వేడుకలో విద్యార్థి ఆకస్మికంగా గుండెపోటుతో మరణించడం కలకలం రేపింది. డీజే శబ్దాల మధ్య నృత్యం చేస్తుండగా అస్వస్థతకు గురైన విద్యార్థి కుప్పకూలి ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం సాధారణంగా 60 డెసిబుల్స్ వరకు ఉన్న శబ్దం మానవులకు సౌకర్యవంతంగా ఉంటుంది. అయితే ఆ స్థాయిని దాటి 80, 100 డెసిబుల్స్ కంటే ఎక్కువ శబ్దాలు వినిపిస్తే చెవులపై, గుండెపై, నాడీ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని చెబుతున్నారు. అధిక శబ్దం కారణంగా రక్తపోటు పెరగడం, ఒత్తిడి అధికమవడం, గుండె స్పందనలో మార్పులు చోటుచేసుకోవచ్చని హెచ్చరిస్తున్నారు.

శబ్ద కాలుష్యం వల్ల వినికిడి లోపాలు మాత్రమే కాకుండా మానసిక ఆందోళన, నిద్రలేమి, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నవారు అధిక శబ్దాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. వేడుకల సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించడం అత్యవసరమని చెబుతున్నారు. వేడుకలు ఆనందాన్ని పంచే సందర్భాలుగా ఉండాలి గానీ విషాదాలకు కారణం కాకూడదని సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. డీజే శబ్దాలపై నియంత్రణ విధించడం, అనుమతించిన పరిమితులకు మించి శబ్దం వినిపించకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజలు కూడా తమ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధిక శబ్దాల నుంచి దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన అట్టర్ ఫ్లాప్: కేసీఆర్

వైఖరిని ప్రజల ముందుంచాలని పిలుపునిచ్చారు. కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి వంటి కీలక ప్రాజెక్టుల నిర్వహణపై కూడా కేసీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. ఈ ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించడం లేదని ఆరోపించారు. ప్రాజెక్టుల పనితీరు, నీటి వినియోగం, సాగునీటి పంపిణీ అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలకు పార్టీ సభ్యులంతా తప్పనిసరిగా హాజరుకావాలని కేసీఆర్ సూచించారు. ప్రతి చర్చలో చురుగ్గా పాల్గొని ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని ఆదేశించారు. కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఉభయసభల్లో ఎండగట్టాలని, ప్రజలకు సంబంధించిన అంశాలను ప్రధానంగా ప్రస్తావించాలని అన్నారు. సభల్లో బీఆర్ఎస్ వైఖరి ప్రజా ప్రయోజనాలకే అంకితమై ఉండాలని స్పష్టం చేశారు. అసెంబ్లీలో ప్రజల అజెండానే బీఆర్ఎస్ అజెండా కావాలని కేసీఆర్ పేర్కొన్నారు. నిరుద్యోగం, రైతు సమస్యలు, సాగునీరు, సంక్షేమ పథకాలు, ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పార్టీ సభ్యులకు సూచించారు. రానున్న సమావేశాల్లో ప్రజల సమస్యలను బలంగా వినిపిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకురావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, రాజకీయ పరిస్థితులు, అసెంబ్లీ వ్యూహాలపై విస్తృతంగా చర్చించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్ రాజీనామా చేయాలి: మహేష్ కుమార్ గౌడ్



చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తోందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజలకు చేరువవుతున్నామని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చి చివరకు నిరాశపరిచారని ఆయన ఆరోపించారు. ఇళ్లు లేని పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. వైద్య రంగాన్ని కూడా గత ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థకే పరిమితం చేసిందని విమర్శించారు. విద్యతో పాటు సంస్కారం కూడా అవసరమని కేటీఆర్‌కు సూచించారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గణనీయమైన పురోగతి సాధించిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల్లో లక్షా 78 వేల కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, గ్లోబల్ సమ్మిట్ ద్వారా మరో ఐదు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు ఆకర్షించామని తెలిపారు. రానున్న రెండున్నర సంవత్సరాల్లో మరిన్ని పరిశ్రమలు తీసుకువచ్చి పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కుటుంబానికే ఉద్యోగాలు వచ్చాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం ఇప్పటికే 70 వేలకుపైగా ఉద్యోగాలు కల్పించామని అన్నారు. కుల సర్వే నిర్వహణలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల నేతృత్వంలో కుల సర్వే నిర్వహించామని తెలిపారు. గద్దర్, అందెశ్రీ వంటి ఉద్యమకారులను గత ప్రభుత్వం విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం గద్దర్ పేరిట అవార్డులు ఏర్పాటు చేసి గౌరవించిందని చెప్పారు. జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించి సామాజిక న్యాయానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చాటిందన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడం ప్రతిపక్షాల హక్కేనని, కానీ అసత్య ప్రచారాలు చేయడం సమంజసం కాదని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రతిపక్షాలు తప్పులు ఎత్తిచూపితే సరిదిద్దుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణలో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తుందనే పూర్తి విశ్వాసం తమకు ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# బాలికను కిడ్నాప్ చేసి సామూహిక అత్యాచారం

ఆగ్రహావేశాలు వ్యక్తమవు తున్నాయి. బాలిక బస్సు కోసం ఎదురుచూస్తుండగా ఓ కారు అక్కడికి చేరుకుని ఆగిందని తెలుస్తోంది. ఎక్కడికి వెళ్తున్నావంటూ మాట్లాడిన ముగ్గురు వ్యక్తులు ఆమెను బలవంతంగా కారులో ఎక్కించుకున్నారని పోలీసులు తెలిపారు. అనంతరం ఆమె చేతులు, కాళ్లు కట్టేసి నిర్జన ప్రాంతానికి తీసుకెళ్లినట్లు బాధితురాలు వాంగ్మూలంలో పేర్కొన్నట్లు సమాచారం. అపహరణ అనంతరం బాలికను భయభ్రాంతులకు గురిచేసినట్లు తెలుస్తోంది. నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన నిందితులు బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. తనను వదిలిపెట్టాలని బాధితురాలు వేడుకున్నప్పటికీ వారు కనికరం చూపలేదని ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది. ఘటన అనంతరం నిందితులు ఆమెను మరో ప్రాంతంలో వదిలేసి, జరిగిన విషయం ఎవరికి చెప్పినా చంపేస్తామని బెదిరించినట్లు బాధితురాలు తెలిపినట్లు సమాచారం. బాధితురాలు సురక్షితంగా బయటపడిన అనంతరం కుటుంబ సభ్యులకు, పోలీసులకు జరిగిన విషయాన్ని వివరించింది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు, నిందితులను గుర్తించేందుకు సీసీటీవీ దృశ్యాలు, ఇతర సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలుస్తోంది. దర్యాప్తు సందర్భంగా బాధితురాలు వెల్లడించిన కొన్ని అంశాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. నిందితులు గతంలో కూడా పలువురిపై నేరాలకు పాల్పడినట్లు చెప్పారని ఆమె పేర్కొన్నట్లు సమాచారం. అయితే ఈ వాదనల నిజానిజాలను పోలీసులు ఇంకా నిర్ధారించాల్సి ఉందని, అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. అధికారిక దర్యాప్తు పూర్తయ్యే వరకు ఈ అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, బాలికల భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నిందితులను త్వరగా అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కేసుకు సంబంధించిన అన్ని వివరాలను సేకరిస్తున్నామని, నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# ఈజిప్టులో భారత వైమానిక దళం 'సారంగ్' విన్యాసాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6, భారత వైమానిక దళానికి చెందిన ప్రతిష్ఠాత్మక 'సారంగ్' హెలికాప్టర్ డిస్ప్లే బృందం ఈజిప్టుకు చేరుకుంది. సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు ఎల్ అలమైన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జరగనున్న రెండో ఎల్ అలమైన్ అంతర్జాతీయ వైమానిక ప్రదర్శనలో ఈ బృందం పాల్గొననుంది. భారత వైమానిక దళం తరఫున అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్ఠను చాటే లక్ష్యంతో సారంగ్ బృందం తన విన్యాసాలను ప్రదర్శించనుంది. సారంగ్ బృందం ప్రపంచంలోనే ఐదు హెలికాప్టర్లతో సమన్వయపూర్వక వైమానిక విన్యాసాలు నిర్వహించే ఏకైక హెలికాప్టర్ ప్రదర్శన బృందంగా గుర్తింపు పొందింది. అత్యంత కచ్చితత్వంతో, సమన్వయంతో కూడిన విన్యాసాల ద్వారా ప్రేక్షకులను అలరించడంలో ఈ బృందానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. పైలట్ల నైపుణ్యం, క్రమశిక్షణ, సమయపాలన ఈ ప్రదర్శనల ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. ఈ బృందం స్వదేశీంగా రూపకల్పన చేసి తయారు చేసిన అధునాతన తేలికపాటి హెలికాప్టర్ 'ధ్రువ్'ను వినియోగిస్తోంది. సమీప దూరాల్లో సమూహంగా ఎగిరే విన్యాసాలు, సమన్వయంతో కూడిన వైమానిక కదలికలు, క్లిష్టమైన ఆకృతి ప్రదర్శనలు సారంగ్ ప్రత్యేకతగా నిలిచాయి. ప్రతి విన్యాసం ప్రేక్షకుల్లో ఉత్సాహాన్ని నింపేలా అత్యంత జాగ్రత్తగా రూపొందించబడుతుంది. సారంగ్ బృందం ప్రదర్శనలు భారత వైమానిక దళం సామర్థ్యాలను మాత్రమే కాకుండా దేశీయ రక్షణ తయారీ రంగం అభివృద్ధిని కూడా ప్రతిబింబిస్తాయి. ధ్రువ్ హెలికాప్టర్ సామర్థ్యాలను అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించడం ద్వారా భారత స్వదేశీ వైమానిక సాంకేతికతకు మరింత గుర్తింపు లభించనుంది. పాల్గొనడం భారత్–ఈజిప్ట్ మధ్య పెరుగుతున్న రక్షణ, దౌత్య సంబంధాలకు నిదర్శనంగా భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో రెండు దేశాల మధ్య రక్షణ రంగ సహకారం మరింత బలోపేతం అవుతున్న నేపథ్యంలో సారంగ్ బృందం పాల్గొనడం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. భారత రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, ఈ అంతర్జాతీయ ప్రదర్శనలో సారంగ్ బృందం తన అద్భుత వైమానిక విన్యాసాలతో ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది. భారత వైమానిక దళం నైపుణ్యం, స్వదేశీ సాంకేతిక సామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పే మరో కీలక అవకాశంగా ఈ ప్రదర్శన నిలవనుంది.

## మురికి కూపం నుంచి జలకళ వరకు.. ఉప్పల్ నల్లచెరువుకు కొత్త రూపు

చర్యలు ఫలితాలను ఇస్తున్నాయి. ఒకప్పుడు మురికి కూపాలుగా, ప్లాస్టిక్ వ్యర్థాలు, మురుగునీరు, ముళ్లపొదలతో నిండిపోయి ప్రజలను భయపెట్టిన చెరువులు ఇప్పుడు సుందర విహార కేంద్రాలుగా రూపాంతరం చెందుతున్నాయి. చెత్తతో నిండిపోయిన ప్రాంతాలు జలకళతో కళకళలాడుతూ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందిస్తున్నాయి. ఇప్పటికే మూడు చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురాగా, మరో మూడు చెరువులు ఈ నెలాఖరులోపు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. ఉప్పల్ నల్లచెరువు అభివృద్ధి పనులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆక్రమణల కారణంగా 52.30 ఎకరాలకు కుదించబడిన చెరువును హైడ్రా చర్యలతో 67.31 ఎకరాలకు విస్తరించారు. చెరువు చుట్టూ 2.4 కిలోమీటర్ల పొడవైన బండ్‌తో పాటు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. అన్ని వయసుల వారు సేదతీరేందుకు గజిబోలు, కూర్చునే ఏర్పాట్లు చేస్తున్నారు. చెరువులోకి వరదనీరు సులభంగా చేరేందుకు ఇన్‌లెట్లు, నీరు నిండిన తర్వాత ఎలాంటి వరద ముప్పు లేకుండా ఔట్‌లెట్లను కూడా అభివృద్ధి చేశారు. చెరువుల పునరుద్ధరణలో భాగంగా ఆక్రమణల తొలగింపుపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. చెరువుల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి సడలింపు లేకుండా చర్యలు తీసుకుంటూ సహజ స్వరూపాన్ని పునరుద్ధరించే పనులు చేపట్టింది. పర్యావరణ పరిరక్షణతో పాటు నగరంలో వర్షాకాల వరద సమస్యలను తగ్గించేందుకు ఈ అభివృద్ధి కార్యక్రమాలు దోహదపడుతున్నాయని అధికారులు చెబుతున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం మాధాపూర్‌లోని తమ్మిడికుంట, సున్నం చెరువుల అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తమ్మిడికుంటలో పేరుకుపోయిన బయో వ్యర్థాలను పూర్తిగా తొలగించి, మురుగునీటిని నిర్మూలించి చెరువును అభివృద్ధి చేసిన తీరును పరిశీలించారు. చెరువుకు సమీపంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, వేర్వేరు చేసే కేంద్రాల వల్ల కాలుష్య ముప్పు ఉందని గుర్తించి వాటిని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. సున్నం చెరువు పరిసరాలను పరిశీలించిన కమిషనర్, చెరువుకు ఆనుకుని ఉన్న బండపై వ్యూ పాయింట్ ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువు చుట్టూ మరింత పచ్చదనం పెంచి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ ప్రాంతాలు భవిష్యత్తులో నగరవాసులకు విశ్రాంతి కేంద్రాలుగా మారాలని ఆకాంక్షించారు. అంతకుముందు కృష్ణాకాంత్ పార్కు చెరువును కూడా కమిషనర్ పరిశీలించారు. రెండో విడతలో అభివృద్ధి చేస్తున్న 14 చెరువుల్లో ఇది ఒకటని పేర్కొన్నారు. ఈ చెరువు లోతు, విస్తీర్ణం పెరిగితే వరద నీటి నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, శ్రీనివాసనగర్, అమీర్‌పేట ప్రాంతాలకు వరద ముప్పును తగ్గించడంలో ఈ చెరువు అభివృద్ధి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు.

## మహిళలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: కవిత

హైదరాబాద్, సెప్టెంబర్ 6, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న సోషల్ మీడియా దూషణలు, ట్రోలింగ్ ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తనపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఇప్పటివరకు తగిన చట్టపరమైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవడానికి చట్టాలు ఉన్నప్పటికీ వాటిని సమర్థవంతంగా అమలు చేయడం లేదని విమర్శించారు. మహిళల భద్రత విషయంలో పోలీసులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. సోషల్ మీడియా వేదికల్లో మహిళలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ట్రోలింగ్‌లు ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయని కవిత అన్నారు. ప్రజా జీవితంలో ఉన్న మహిళలపైనే ఇలాంటి దాడులు జరుగుతుంటే సాధారణ మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలని పేర్కొన్నారు. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని చట్టాలు స్పష్టంగా చెబుతున్నాయని, అయినప్పటికీ అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆరోపించారు. చట్టాలను అమలు చేయడంలో అధికారులు మరింత చురుకుదనం ప్రదర్శించాలని సూచించారు.

తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని కవిత విమర్శించారు. ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు గుర్తింపు, సంక్షేమం, భద్రత కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పక్కనపెట్టారని ఆరోపించారు. ఉద్యమకారుల కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. వారికి గుర్తింపు కార్డులు, బీమా, పెన్షన్ వంటి సౌకర్యాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యమకారుల సమస్యలపై స్పష్టమైన కాలపరిమితితో కూడిన ప్రకటన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కవిత కోరారు. ఉద్యమకారులకు సంబంధించిన పూర్తి సమాచారం ప్రభుత్వ వద్ద ఉన్నందున నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం చేయడానికి కారణం లేదన్నారు. కొంతమందికైనా గుర్తింపు కార్డులు జారీ చేసి ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. ఇచ్చిన హామీల అమలు విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధిని ప్రదర్శించాలని అన్నారు.

బీసీల సంక్షేమం, రిజర్వేషన్ల అంశాలపై కూడా కవిత స్పందించారు. బీసీలకు న్యాయం చేస్తామని చెప్పే పార్టీలు ఆచరణలో మాత్రం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వంతో సమర్థవంతమైన చర్చలు జరపడం లేదని ఆరోపించారు. కుల గణనలో స్పష్టమైన వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని కవిత అన్నారు. ఫీజు నియంత్రణ, ఉద్యమకారుల సంక్షేమం, మహిళల భద్రత, సామాజిక న్యాయం వంటి అంశాలపై చట్టపరమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని, లేకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యంగా ఉండాలని ఆమె పేర్కొన్నారు.

## నీలాకాశం కోసం స్వచ్ఛమైన గాలి అవసరం

డెస్క్, సెప్టెంబర్ 6, ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 7న అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి దినోత్సవాన్ని నిర్వహిస్తారు. గాలి కాలుష్యం వల్ల ఏర్పడుతున్న ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెంచడం, పరిశుభ్రమైన గాలి అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలు, సంస్థలు, పౌరులను చైతన్యపరచడం ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం. మనిషి ఆహారం లేకుండా కొన్ని రోజులు, నీరు లేకుండా కొంతకాలం జీవించగలడు. కానీ గాలి లేకుండా కొన్ని నిమిషాలకంటే ఎక్కువ కాలం బతకలేడు. అలాంటి గాలి నాణ్యత రోజురోజుకూ క్షీణిస్తుండటం ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. పారిశ్రామికీకరణ, వేగవంతమైన పట్టణీకరణ, వాహనాల సంఖ్య పెరగడం, ఇంధనాల అధిక వినియోగం కారణంగా గాలి కాలుష్యం తీవ్రమవుతోంది. నగరాల్లో పొగ, ధూళి, రసాయన కణాలు వాతావరణంలో కలవడంతో శ్వాస తీసుకోవడం కూడా కష్టమవుతోంది. ఒకప్పుడు నిర్మలంగా కనిపించిన ఆకాశం ఇప్పుడు పొగమంచుతో కమ్ముకుపోయే పరిస్థితులు అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. అభివృద్ధి పేరుతో ప్రకృతిని నిర్లక్ష్యం చేయడం వల్ల మనం స్వయంగా మన ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాం. గాలి కాలుష్యం మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్యలు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి అనేక వ్యాధులకు ఇది ప్రధాన కారణంగా మారుతోంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు కాలుష్య ప్రభావానికి ఎక్కువగా గురవుతున్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది గాలి కాలుష్యంతో సంబంధం ఉన్న ఆరోగ్య సమస్యల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని వివిధ అధ్యయనాలు సూచిస్తున్నాయి. అందువల్ల స్వచ్ఛమైన గాలి అనేది విలాసం కాదు, ప్రతి మనిషి ప్రాథమిక హక్కు.

వేగంగా విస్తరిస్తున్న నగరాలు గాలి కాలుష్యానికి కేంద్రాలుగా మారుతున్నాయి. పెరుగుతున్న నిర్మాణ కార్యకలాపాలు, పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్య వాయువులు, వాహనాల నుంచి వచ్చే పొగ వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. జనాభా పెరుగుదలతో పాటు ఇంధన అవసరాలు కూడా పెరుగుతుండటంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. అభివృద్ధి అవసరమే అయినప్పటికీ అది పర్యావరణ పరిరక్షణకు విరుద్ధంగా ఉండకూడదు. స్థిరమైన అభివృద్ధి విధానాల ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

గాలి కాలుష్యం కేవలం ఆరోగ్య సమస్య మాత్రమే కాదు, వాతావరణ మార్పులకు కూడా ప్రధాన కారణాల్లో ఒకటి. శిలాజ ఇంధనాల దహనం వల్ల విడుదలయ్యే వాయువులు భూతాపాన్ని పెంచుతున్నాయి. దీనివల్ల ఉష్ణోగ్రతలు పెరగడం, అసాధారణ వర్షాలు, కరువులు, తుఫాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాలు ఎక్కువ అవుతున్నాయి. కాబట్టి గాలి కాలుష్యాన్ని తగ్గించడం అంటే కేవలం మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మాత్రమే కాదు, భూమి భవిష్యత్తును కూడా రక్షించడం.

ఈ సమస్యను ఎదుర్కోవడంలో ప్రభుత్వాల పాత్ర అత్యంత కీలకం. కాలుష్య నియంత్రణ చట్టాలను కఠినంగా అమలు చేయడం, పరిశ్రమలపై పర్యవేక్షణ పెంచడం, స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం, ప్రజా రవాణా వ్యవస్థలను బలోపేతం చేయడం వంటి చర్యలు అవసరం. పర్యావరణానికి హాని కలిగించే కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పునరుత్పాదక శక్తి వనరుల వినియోగాన్ని విస్తరించాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరం. వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించడం, ప్రజా రవాణాను ప్రోత్సహించడం, అవసరం లేని ఇంధన వినియోగాన్ని నివారించడం, చెత్తను బహిరంగంగా తగలబెట్టకుండా ఉండటం వంటి చిన్న చిన్న చర్యలు కూడా గాలి నాణ్యత మెరుగుపడటానికి దోహదపడతాయి. పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని ప్రతి పౌరుడు గుర్తించాలి. పచ్చదనం పెంపొందించడం గాలి కాలుష్య నియంత్రణలో అత్యంత ప్రభావవంతమైన మార్గాల్లో ఒకటి. చెట్లు కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. అందువల్ల పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా పెద్ద ఎత్తున వృక్షారోపణ కార్యక్రమాలు చేపట్టాలి. ఇప్పటికే ఉన్న అడవులను సంరక్షించడంతో పాటు కొత్తగా పచ్చదనాన్ని పెంచే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రకృతితో సమతుల్యతను కాపాడుకోవడం ద్వారానే స్వచ్ఛమైన గాలి సాధ్యమవుతుంది. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని అందించాలంటే నేటి నుంచే చర్యలు ప్రారంభించాలి. పిల్లలు స్వచ్ఛమైన గాలిని పీల్చే హక్కును కోల్పోకుండా చూడటం మన బాధ్యత. కాలుష్యాన్ని నియంత్రించడంలో విఫలమైతే రానున్న తరాలు మరింత తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందువల్ల పర్యావరణ పరిరక్షణను తాత్కాలిక కార్యక్రమంగా కాకుండా దీర్ఘకాలిక బాధ్యతగా భావించాలి. అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి దినోత్సవం మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తోంది. స్వచ్ఛమైన గాలి లేకుండా ఆరోగ్యవంతమైన జీవితం అసాధ్యం. గాలి కాలుష్య నియంత్రణ కోసం ప్రభుత్వాలు, పరిశ్రమలు, శాస్త్రవేత్తలు, పౌరులు కలిసి పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి. నీలాకాశం కింద పరిశుభ్రమైన గాలిని ఆస్వాదించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆ హక్కును కాపాడుకోవడం కోసం సమిష్టి కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైంది.

# పెద్దలను వదిలి పేదల మీద ప్రతాపం చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం





**• - పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్**

**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 06 ( తరంగాలు )**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పేదల కష్టార్జితాన్ని కూల్చివేయడం అత్యంత దురదృష్టం కరమైన సంఘటనలు అని మేడ్చల్ - మల్కాజ్గిరి పార్లమెంట్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,?పరిధిలోని గిరినగర్, వెంకట్రామరెడ్డి నగర్‌లలో పేద ప్రజలు ఎంతో కష్టపడి కట్టుకున్న 50 గజాలు, 80 గజాల చిన్న చిన్న ఇళ్లను జిహెచ్ఎంసి అధికారులు దౌర్జన్యంగా కూల్చివేయడం అత్యంత విచారకరమని పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు.రెక్కాడితే గానీ డొక్కాడని పేదలపై ప్రతాపం చూపించడం భావ్యం కాదని బాధితులకు న్యాయం జరిగే వరకు బిజెపి అండగా ఉంటుందని ఆదివారం జరిగిన సమావేశం లో ఎంపీ ఈటల రాజేందర్ తెలియజేశారు.

ఈ కార్యక్రమం కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ రంగా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరుగగా మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా నందనం దివాకర్, మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు శేఖర్ యాదవ్,గరిగే శేఖర్, డివిజన్ అధ్యక్షులు మణికంత, ఎం శ్యామ్, నారాయణ గౌడ్, లక్ష్మీ నాథ్, దుర్గయ్య గౌడ్, మోయిన్, సంతోష్ గౌడ్, సతీష్, స్థానిక నాయకులు బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## నూతన ఎస్సై ని సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి సెప్టెంబర్ 6 తరంగాలు**

వలిగొండ మండల కేంద్రంలో స్థానిక పోలీస్ స్టేషన్లో ఆదివారం నూతన సబ్ ఇన్స్పెక్టర్ గా వచ్చిన ఏ శ్రీకాంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించిన శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ సైదులు, గ్రామశాఖ అధ్యక్షుడు బీమనబోయిన బిక్షపతి, వార్డు సభ్యులు గంట భాస్కర్,పబ్బు వెంకటేష్, మచ్చ సునీత స్వామి,మాజీ సర్పంచ్ జక్కుల శంకరయ్య,మాజీ పాల సంఘం చైర్మన్ పబ్బు సత్తయ్య, పాల సంఘం డైరెక్టర్ సింగం మహేష్ మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు మచ్చ నవీన్,జడిగే మహేష్, పబ్బు బాలకృష్ణ,బీమనబోయిన మచ్చేందర్,మచ్చ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణానికి భూమి పూజ



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి సెప్టెంబర్ 6 తరంగాలు**

తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామంలో గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య భూమి పూజ చేశారు.భూమి పూజతో ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.గంధమల్ల రిజర్వాయర్ పూర్తయితే ఆలేరు నియోజకవర్గంతో పాటు పరిసర మండలాలు సస్యశ్యామలం కానున్నాయి.గంధమల్ల ప్రాజెక్టు ద్వారా ఆలేరు నియోజకవర్గంలోని 58 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది.1.41 టీఎంసీల సామర్థ్యంతో గంధమల్ల ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనుంది.గంధమల్ల రిజర్వాయర్‌తో రైతులకు సాగునీటి భరోసా, వ్యవసాయాభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి తిర్మలాపురం వద్ద శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే.సీఎం రేవంత్ రెడ్డి సంకల్పంతో, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గారి కృషితో గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణ పనులు ముందుకు సాగుతున్నాయి.

## వాస్తు రత్న అవార్డుతో హనుమదాస్ పీసరి మల్లారెడ్డి కి సత్కారం




**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి సెప్టెంబర్ 6 తరంగాలు**

వాస్తు రంగంలో విశేష సేవలు అందిస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని నర్సాపురం గ్రామానికి చెందిన హనుమదాస్ పీసరి మల్లారెడ్డి ప్రతిష్టాత్మక వాస్తు రత్న అవార్డు అందుకున్నారు.సుమన్ ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బిర్లా ప్లానెటోరియం ప్రాంగణంలోని భాస్కర ఆడిటోరియంలో సాట్ ఐకాన్ 2026 అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురు ప్రముఖులను ఈ సందర్భంగా అవార్డులతో సత్కరించారు.కార్యక్రమంలో భాగంగా హనుమదాస్ పీసరి మల్లారెడ్డి వాస్తు రత్న పురస్కారాన్ని తెలంగాణ మాజీ స్పీకర్ మధుసూదనాచారి చేతుల మీదుగా ప్రదానం చేశారు. వాస్తు రంగంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధుసూదనాచారి అవార్డు గ్రహీతలను అభినందించారు. సమాజంలోని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న వారిని గుర్తించి సత్కరించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ అవార్డు కార్యక్రమంలో సినీ ప్రముఖులు రుద్రరాజు పద్మరాజు, సుమన్ ఆర్ట్స్ థియేటర్స్ వ్యవస్థాపకులు పల్లె సుమన్, కార్యదర్శి ప్రతీక్ తదితరులు పాల్గొన్నారు. అవార్డు అందుకున్న హనుమదాస్ పీసరి మల్లారెడ్డి పలువురు అభినందించారు.

## ఘనంగా జిట్టా 2వ వర్ధంతి వేడుకలు

యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి సెప్టెంబర్ 6 తరంగాలు

వలిగొండ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో జిట్టా బాలకృష్ణారెడ్డి 2వ వర్ధంతి వేడుకలను అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ నాయకత్వాన్ని ఢిల్లీ నుండి గల్లీ వరకు పరిచయం చేసిన వ్యక్తి భువనగిరి నియోజకవర్గంలో ఉద్యమాన్ని ఉరవతలాడించిన గొప్ప వ్యక్తి జిట్ట బాలకృష్ణ రెడ్డి అని ప్రతి గ్రామంలో వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు చేసిన ఘనత ఆయనదేనని ఆయన చేసిన సేవలను కొనియాడారు.ఆయన ఆశయాలను కొనసాగిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిట్టా అభిమానులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## అకాల మరణం చెందిన సభ్యుల కుటుంబాలకు అండగా కాకతీయ పరపతి సంఘం





**• ఇరు కుటుంబాలకు రూ.30 వేల చొప్పున ఆర్థిక సాయం**

**వర్ధన్నపేట ప్రతినిధి, సెప్టెంబర్ 6,తరంగాలు** : కాకతీయ పరపతి సంఘం సభ్యులు రఘుసాల వెంకటేశ్వర్లు, బొమ్మిదేని శివకుమార్‌లు అకాల మరణం చెందడంతో సంఘ కార్యవర్గం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఆదివారం కాకతీయ పరపతి సంఘం అధ్యక్షుడు సమ్మెట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భానుచందర్ మృతుల నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.మరణ విపత్తు సహాయం కింద ఇరు కుటుంబాలకు రూ.30 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. సంఘ సభ్యుల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని, సభ్యుల ఆకస్మిక మరణం సంఘానికి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి కొండ గోపాల్, సంఘ సభ్యులు కీర్తి సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన నిలవడమే నిజమైన జర్నలిజం





**• నిజాయితీ, నిష్పక్షపాత వార్తలతో ప్రభుత్వం-ప్రజలకు బలమైన వారధిగా పనిచేయాలి**

**•ఎం 1 టీవి ఛానల్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఈగ మల్లేశం**

**వరంగల్ ప్రతినిధి , సెప్టెంబర్ 6, తరంగాలు** : ప్రజల పక్షాన నిలవడమే నిజమైన జర్నలిజం అని కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. వరంగల్ పట్టణంలోని లేబర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎం 1 టీవీ ఛానల్ కార్యాలయాన్ని కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఈగ మల్లేశం మాట్లాడుతూ.. మీడియా సమాజంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని, నిజాయితీ, నిష్పక్షపాత వార్తలతో ప్రజల పక్షాన నిలవాలని అన్నారు. ప్రజా సమస్యలను వెలికితీసి, ప్రభుత్వం--ప్రజల మధ్య బలమైన వారధిగా నిలవడమే నిజమైన జర్నలిజమని పేర్కొన్నారు.సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. వెనుకబడిన, బాధిత, అట్టడుగు వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా మీడియా సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఎం 1 టీవీ ప్రజల ఆదరణ పొందుతూ సమాజ శ్రేయస్సుకు తోడ్పడాలని ఆకాంక్షించారు.అనంతరం ఎం 1 టీవీ సీఈవో అమరేంద్ర చారి, ఎండీ బేతి అశోక్, బేతి రాజులు ఈగ మల్లేశంను శాలువా, మెమొంటోతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సత్యనారాయణ, గడ్డం భాస్కర్, చిప్ప వెంకటేశ్వర్లు, పోతన వెంకటేశ్వర్లు, మామిడాల రమేష్ బాబు, బంక కుమారస్వామి, కరుణాకర్, వేణు, ప్రసాద్, రాజు, శ్రీధర్, పవన్, మనోహర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.





## ఎనుమాముల ఈవీఎం గోదాం త్రైమాసిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి , సెప్టెంబర్ 6, తరంగాలు :** త్రైమాసిక తనిఖీలో భాగంగా ఆదివారం ఎనుమాముల మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా గోదాంలో అమలులో ఉన్న భద్రతా చర్యలు, నిర్వహణ ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు.ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.తనిఖీ లో డియార్వో విజయలక్ష్మి ,వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించాలి

- ఓటర్ల సందేహాలను నివృత్తి చేసి, ఫారం 6, 7, 8 అందుబాటులో ఉంచాలి
- వరంగల్ జిల్లా డాక్టర్ కలెక్టర్ సత్య శారద



వరంగల్ ప్రతినిధి , సెప్టెంబర్ 6, తరంగాలు : ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించాలని, ఫారం 6, 7, 8లను ఓటర్లకు అందుబాటులో ఉంచాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.నర్సంపేట మండలం లక్ష్మణపల్లిలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ (సర్ ) ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ ఆదివారం పరిశీలించారు.స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణ, పురోగతిని కలెక్టర్ పరిశీలించి, ఓటర్లకు అందుతున్న సేవలు, సంబంధిత దరఖాస్తులు, ప్రక్రియ అమలు తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎలాంటి లోపాలకు తావులేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఓటర్లకు అవసరమైన సమాచారాన్ని అందిస్తూ వారి సందేహాలను నివృత్తి చేయాలని పేర్కొన్నారు.శని, ఆదివారాల్లో ప్రత్యేక ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, ఈ నెల 12, 13 తేదీల్లో కూడా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎస్ఐఆర్పై సందేహాలు ఉన్న ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కలెక్టర్ వెంట నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, నర్సంపేట తహసీల్దార్ రవిచంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.

## కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి: కూన శ్రీశైలం గౌడ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 6,తరంగాలు** : మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎమ్మెల్యే, ప్రతిపక్ష నేతగా పూర్తిగా విఫలమయ్యారని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ విమర్శించారు. కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పీసీసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన మహా ధర్నాలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా వ్యవసాయ క్షేత్రానికే పరిమితమైన కేసీఆర్, ప్రతిపక్ష నేతగా తన బాధ్యతలను నిర్వర్తించడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్యే పదవిలో కొనసాగుతూ సుమారు కోటి రూపాయలకు పైగా జీతాలు తీసుకుంటున్న కెసిఆర్ ఆ పదవికి అనర్హుడని అన్నారు.ప్రజాస్వామ్య విలువలు, ప్రజల పట్ల బాధ్యతను దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ధర్నాలో రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, వి.హనుమంతరావు, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, అంజన్‌కుమార్ యాదవ్, జగ్గారెడ్డి, వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# వినూత్న ఉత్పత్తులతో స్వయం ఉపాధికి అవకాశాలు





- యువత ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**హన్మకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 6,తరంగాలు:** మిల్లెట్ ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంతోపాటు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. ఆదివారం హనుమకొండ గోపాల్ పూర్ జవహర్ కాలనీలో ఐఐఎంఆర్ న్యూట్రి హబ్ ప్రోత్సాహంతో ఉజ్వల చంద్రగిరి అనే యువతి ఎంటర్‌ప్రెన్యూషిప్ లో భాగంగా నెలకొల్పిన అరిస్సా గ్రోత్ ఫార్మ్స్ మిల్లెట్ పన్నీరు మాన్యూఫ్యాక్చరింగ్ ప్రాసెసింగ్ యూనిట్ ను జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఉత్పత్తి యూనిట్ కు సంబంధించిన వివరాలను ఎంటర్‌ప్రెన్యూరర్ ఉజ్వలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. హనుమకొండలో దేశంలోనే తొలిసారిగా ప్లాంట్ బేస్డ్ మిల్లెట్ పన్నీర్ తయారీ యూనిట్ ఇది అని, ఈ యూనిట్‌లో పాల ఉత్పత్తులతో కాకుండా మొక్కల నుంచి లభించే ప్రోటీన్‌ను ఉపయోగించి నాన్-డెయిరీ మిల్లెట్ పన్నీర్, మిల్లెట్ బాసుంది తయారు చేస్తామని తెలిపారు. ఆరోగ్యకరమైన, పోషక విలువలతో కూడిన ప్రత్యామ్నాయ ఆహార ఉత్పత్తుల తయారీకి ఈ యూనిట్ దోహదపడుతుందన్నారు.ఈ పరిశ్రమ ఏర్పాటుకు హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ ఆర్కేవీవై రాఫ్తార్ కార్యక్రమం ద్వారా స్థాపించినట్లు పరిశ్రమ నిర్వాహకురాలు ఉజ్వల కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ మిల్లెట్ ఆధారిత ఉత్పత్తుల తయారీలో ఐఐఎంఆర్ వంటి సంస్థల సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కొత్త ఉత్పత్తులను అభివృద్ధి చేయాలని సూచించారు. ఆహార శుద్ధి (ఫుడ్ ప్రాసెసింగ్) పరిశ్రమలకు ప్రస్తుతం విస్తృతమైన డిమాండ్ ఉందని, నిరుద్యోగ యువత కొత్త పరిశ్రమల ఏర్పాటుతో స్వయం ఉపాధి సాధించాలని తెలిపారు. మిల్లెట్ ఉత్పత్తుల తయారీ రంగంలో మహిళలు, యువతకు స్వయం ఉపాధి, స్వయం ఆర్థిక సాధికారతకు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ ప్రోత్సాహకాలు, పథకాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ న్యూట్రి హబ్ కు చెందిన డాక్టర్ జె.స్టాన్లే , జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, న్యూట్రిహబ్ బృందం, తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలీల భవిష్యత్‌కు “ఐక్యతే ఆయుధం”





- చేనేత కుటుంబాల హక్కుల కోసం సమష్టి పోరాటం అవసరం
- పద్మశాలీలు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో ఎదగాలంటే ఐక్యంగా ముందుకు సాగాలి
- పద్మశాలీల అభ్యున్నతికి ఎల్లవేళలా అండగా ఉంటా
- కేంద్ర ఖాదీ,చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం

**హన్మకొండ ప్రతినిధి , సెప్టెంబర్ 6, తరంగాలు :** పద్మశాలి సమాజం ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా మరింత అభివృద్ధి చెందాలంటే కుల ఐక్యత ఎంతో అవసరమని కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. హన్మకొండ పట్టణం భీమారంలోని ఎస్వీఎస్ క్యాంపస్‌లో స్వరాజ్ న్యూస్, నేతన్న టీవీ సంయుక్తంగా నిర్వహించిన నేతన్న టీవీ అవార్డ్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ..పద్మశాలీల భవిష్యత్‌కు ఐక్యతే బలమైన ఆయుధం అని అన్నారు. పద్మశాలీల సంప్రదాయ వృత్తి అయిన చేనేత రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు, రాయితీలు సకాలంలో అందేలా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పద్మశాలి సమాజ సంక్షేమంతో పాటు చేనేత, అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల హక్కుల పరిరక్షణకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.విశిష్ట ప్రతిభకు నేతన్న టీవీ అవార్డులు

నేతన్న టీవీ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పద్మశాలి సమాజంలో వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన పలువురికి ఈగ మల్లేశం చేతుల మీదుగా ప్రతిష్టాత్మక అవార్డులను అందజేశారు. సమాజంలోని ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహిస్తున్న నేతన్న టీవీ ఎండీ రాజేందర్, సీఈఓ స్వాతి, యాజమాన్యాన్ని ఈగ మల్లేశం అభినందించారు.అనంతరం నేతన్న టీవీ యాజమాన్యం తరఫున ఈగ మల్లేశంను శాలువా, మెమంటోతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సమాజ ప్రతినిధులు, నేతన్న టీవీ సిబ్బంది, వివిధ రంగాలకు చెందిన అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.



## సనాతన ధర్మ పరిరక్షణకు కోటి దీపోత్సవం దోహదం

- ఆధ్యాత్మిక వైభవానికి గాజులరామారం వేదిక
- కోటి దీపోత్సవ పోస్టర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్




**గాజులరామారం, సెప్టెంబర్ 6, తరంగాలు :** ఆధ్యాత్మికత, భక్తిభావం, సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిర్వహించనున్న కోటి దీపోత్సవం కార్యక్రమం పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆదివారం ఆవిష్కరించారు.గాజులరామారంలోని చితారమ్మ ఆలయ ప్రాంగణంలో శ్రీ శ్రీ శ్రీ నకులేశ్వరిదేవి సిద్ధి పీఠం ఆధ్వర్యంలో కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సనాతన సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను ప్రజల్లో మరింతగా పెంపొందించేందుకు ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అంతయ్య గౌడ్, ఇంద్రసేనారెడ్డి, బాలరాజ్, నకులేశ్వరిదేవి సిద్ధి పీఠం ప్రతినిధి నందు పంతులు, స్థానిక నాయకులు బుచ్చిరెడ్డి, మోతే శ్రీనివాస్ యాదవ్, ఆర్వ వెంకట్, ప్రభాకర్ రెడ్డి, షాకీర్, తోసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన విద్యా,వసతి సౌకర్యాలు అందించాలి





• వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ ప్రతినిధి , సెప్టెంబర్ 6, తరంగాలు :విద్యార్థులకు మెరుగైన విద్యా,వసతి సౌకర్యాలు అందించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. నెక్కొండ మండల కేంద్రంలోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ మరియు జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా, వసతి సౌకర్యాలను పరిశీలించారు.కలెక్టర్ తరగతి గదులను సందర్శించి విద్యార్థులకు జరుగుతున్న బోధన, వారి అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారు చదువుతున్న విషయాలు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం వసతి గదులు, భోజనశాల, వంటశాల తదితర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, పౌష్టికాహారాన్ని అందించాలని, వంటశాల, భోజనశాల పరిసరాల్లో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు.విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థాయికి ఎదిగేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని తెలిపారు.పాఠశాల, జూనియర్ కళాశాల నిర్వహణకు సంబంధించిన అంశాలను సంబంధిత అధికారులతో సమీక్షించి, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు.ఈ సందర్శన లో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, డిటిడివో నారాయణ రెడ్డి, తహసిల్దార్ ఎంపీడీవో , నెక్కొండ తహసిల్దార్ రాజ్ కుమార్, డి ఎస్ డి ఓ హమీద్,సంబంధిత ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.



## ఇనుగాల వెంకట్రాంరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు



**హనుమకొండ ప్రతినిధి , సెప్టెంబర్ 6, తరంగాలు** : హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాంరెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన నివాసంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పోలేపల్లి బుచ్చిరెడ్డి తదితరులు ఇనుగాల వెంకట్రాంరెడ్డికి పుష్ప మొక్కను అందజేసి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చందర్ రెడ్డి, కరుణ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఇనుగాల వెంకట్రాంరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# కేసముద్రం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సమ్మయ్య గౌడ్‌కు ఘన సన్మానం





**కేసముద్రం ప్రతినిధి, సెప్టెంబర్ 6,తరంగాలు** : కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన చిలువేరు సమ్మయ్య గౌడ్‌ను కాట్రపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షులు జల్లే యాకాంబరం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సమ్మయ్య గౌడ్ స్వగృహానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.
ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని మండలంలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేద ప్రజలకు చేరేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. పార్టీలో ఎలాంటి విభేదాలకు తావులేకుండా అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.నూతన మండల అధ్యక్షుడిగా ఎన్నికైన చిలువేరు సమ్మయ్య గౌడ్కు నాయకులు, కార్యకర్తలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పార్టీకి విలువైన సేవలు అందిస్తూ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాట్రపల్లి గ్రామ ఉపసర్పంచ్ చాగంటి యాదగిరి, గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు పుట్ట ప్రభాకర్, సీనియర్ నాయకులు కాలేపాక లక్ష్మయ్య, సాంబార్ వీరస్వామి, బోడ ఈరయ్య, బోడ బద్రు, యువ నాయకులు మారగోని రాజేష్, కొంచెం మునేందర్, చీకటి ప్రశాంత్, గుగులోత్ సురేష్, వాంకుడోత్ బద్రు తదితరులు పాల్గొన్నారు.

## సాయంత్రం భోజనం చేశాక తీపి తినాలపిస్తుందా అయితే అలా ఎందుకు జరుగుతుంది



సాయంత్రం భోజనం చేసిన తర్వాత తీపి తినాలనే కోరిక చాలా మందిలో కనిపిస్తుంది. ఇలా స్వీట్ కోసం పదేపదే అనిపిస్తే శరీరంలో ఏదైనా పోషక లోపం ఉందని భావించడం సహజం. అయితే ప్రతి ఆహార కోరిక వెనుక ఒక నిర్దిష్ట విటమిన్ లేదా మినరల్ లోపమే కారణం అని చెప్పడం సరైనది కాదు. మనం రోజంతా ఎలా తిన్నాం, ఎంత నిద్రపోయాం, ఒత్తిడి ఎలా ఉంది, మన ఆహారపు అలవాట్లు ఎలా ఉన్నాయి వంటి అనేక అంశాలు ఈ కోరికలపై ప్రభావం చూపుతాయి. సోషల్ మీడియాలో ప్రతి ఆహార కోరికను శరీరం పంపే సంకేతంగా, దానికి కారణాన్ని ఒక పోషక లోపంగా చెప్పే విషయాలు తరచూ కనిపిస్తుంటాయి. ఉదాహరణకు చాక్లెట్ తినాలనిపిస్తే మెగ్నిషియం లోపం, ఐస్ తినాలనిపిస్తే ఐరన్ లోపం, ఉప్పగా తినాలనిపిస్తే అడ్రినల్ ఫెటీగ్ అంటూ వివిధ కారణాలు చెబుతుంటారు. కానీ మన శరీరం ఇంత సులభమైన పద్ధతిలో పనిచేయదు.

### పోషకాహార లోపమా

సాయంత్రం వేళల్లో తీపి తినాలనే కోరికకు చాలా సందర్భాల్లో ఒకే ఒక్క పోషక లోపం కారణం కాదు. రోజంతా తగినంత ఆహారం తీసుకోకపోవడం కూడా ఇందుకు కారణమవుతుంది. ఉదయం అల్పాహారం తొందరగా ముగించడం లేదా పూర్తిగా మానేయడం, మధ్యాహ్నం ఆరోగ్యంగా తినాలనే ఉద్దేశంతో చాలా తక్కువగా భోజనం చేయడం, సాయంత్రం ఆకలిని కాఫీతో అణచుకోవడం వంటి అలవాట్లు ఉంటే రాత్రి భోజనం సమయానికి శరీరం రోజంతా ఎదురైన ఆహార లోటును భర్తీ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఈ సమయంలో తీపి తినాలనే కోరిక మరింత పెరుగుతుంది. అలాగే ఆహారపు అలవాట్లు కూడా తీపి కోరికకు కారణమవుతాయి. చిన్నప్పటి నుంచి భోజనం తర్వాత బెల్లం ముక్క, టీతో బిస్కెట్ లేదా భోజనం తర్వాత కీర్ వంటి తీపి పదార్థాలు తినే అలవాటు ఉంటే, క్రమంగా మెదడు ఆ రివార్డ్‌ను ఆశించడం ప్రారంభిస్తుంది. దీంతో తీపి తినకుండా భోజనం పూర్తయినట్లు అనిపించదు. ఇది తప్పనిసరిగా పోషక లోపానికి సంకేతం కాదు.

### మానసికంగా అలసిపోతే..

రక్తంలో చక్కెర స్థాయిలు కూడా కొంతవరకు ప్రభావం చూపిస్తాయి. భారతీయ భోజనాల్లో అన్నం, చపాతీలు, పప్పులు వంటి కార్బోహైడ్రేట్లు ప్రధానంగా ఉంటాయి. వీటిలో తప్పేమీ లేదు. అయితే భోజనంలో తగినంత ప్రోటీన్, ఫైబర్ లేకపోతే ఎక్కువసేపు కడుపు నిండిన భావన ఉండదు. ఫలితంగా భోజనం చేసిన కొద్దిసేపటికే మరోసారి ఏదైనా తినాలనే కోరిక వస్తుంది. ఒత్తిడి కూడా ఈ విషయంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. మానసికంగా అలసిపోయిన రోజు తర్వాత మెదడు త్వరగా ఆనందాన్ని, ఉపశమనాన్ని కలిగించే ఆహారాల వైపు మొగ్గుచూపుతుంది. చాక్లెట్, స్వీట్లు వంటి తీపి పదార్థాలు అలాంటి సమయంలో మరింత ఆకర్షణీయంగా అనిపిస్తాయి. ఇది కేవలం ఆత్మనియంత్రణ లోపం లేదా సంకల్ప బలహీనత అని భావించాల్సిన అవసరం లేదు. నిద్ర కూడా ఆహార కోరికలపై ప్రభావం చూపే ముఖ్యమైన అంశం. వరుసగా కొన్ని రోజులు సరిగా నిద్రపోకపోయినా ఆకలిని నియంత్రించే హార్మోన్లపై ప్రభావం పడుతుంది. దీంతో ముఖ్యంగా చక్కెర, ఎక్కువ రుచి కలిగిన ఆహారాలపై కోరిక పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే ఆహారం విషయంలో నిద్రను కూడా విస్మరించకూడదు.

### మెగ్నిషియం సంగతేంటి..

మెగ్నిషియం విషయానికి వస్తే, శరీరంలో జరిగే వందలాది జీవరసాయన చర్యల్లో దీనికి పాత్ర ఉంది. గ్లూకోజ్ మెటబాలిజం, ఇన్సులిన్ సెన్సిటివిటీ వంటి ప్రక్రియల్లో కూడా మెగ్నిషియం ముఖ్యమైనది. అయితే భోజనం తర్వాత స్వీట్ తినాలనే ప్రతి కోరికను మెగ్నిషియం లోపంతో ముడిపెట్టడం మాత్రం చాలా సరళీకరణ అవుతుంది. ఒక ఆహార కోరిక కనిపించిందని వెంటనే సప్లిమెంట్లు తీసుకోవడం సరైన విధానం కాదు. అందుకే తీపి తినాలనే కోరిక వచ్చినప్పుడు ఏ సప్లిమెంట్ తీసుకోవాలి? అనే ప్రశ్న కంటే ఈ కోరిక రావడానికి ముందు రోజంతా ఏం జరిగింది? అని ఆలోచించడం ఉపయోగకరంగా ఉంటుంది. రోజంతా తగినంత ఆహారం తీసుకున్నామా, భోజనంలో ప్రోటీన్ సరిపడా ఉందా, నిద్ర సరిగ్గా ఉందా, ఒత్తిడి ఎక్కువగా ఉందా, నిజంగా ఆకలిగా ఉందా లేదా అలవాటు ప్రకారం ఏదైనా తినాలనిపిస్తుందా అనే విషయాలను గమనించాలి. అన్నింటికంటే ముఖ్యంగా, తీపి తినాలనిపించడం అంటే మనం ఏదో తప్పు చేశామని అర్థం కాదు. దీనిని బట్టి సంకల్ప బలం తక్కువగా ఉందని, మెటబాలిజం దెబ్బతిన్నదని లేదా మనం ఆరోగ్యకరమైన ఆహార నియమాలను పాటించలేకపోతున్నామని భావించాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు పోషక అసమతుల్యత కారణం అవుతుంది. మరికొన్ని సందర్భాల్లో అలవాటు, ఒత్తిడి లేదా అలసట కారణం అవుతాయి. మరికొన్ని సందర్భాల్లో ఎలాంటి ప్రత్యేక కారణం లేకుండానే తీపి తినాలనిపిస్తుంది. చివరికి, మనం మనుషులం కాబట్టి కూడా అప్పుడప్పుడు స్వీట్ తినాలనే కోరిక వస్తూ ఉంటుంది.

# ఇనుగాల వెంకటరామిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు




• జన్మదినం సందర్భంగా శాలువాతో ఘన సన్మానం చేసిన నకరకంటి మోహన్ గౌడ్, పోలపల్లి బుచ్చిరెడ్డి

**హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 6,తరంగాలు** : హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనుగాల వెంకటరామిరెడ్డి జన్మదినం సందర్భంగా ఐనవోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు పోలపల్లి బుచ్చిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇనుగాల వెంకటరామిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన మరింత చురుకుగా సేవలందించాలని కోరుకున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఈగ మల్లేశం



**వరంగల్ ప్రతినిధి , సెప్టెంబర్ 6, తరంగాలు** :నూతన వధూవరులను కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ఆశీర్వదించారు.వరంగల్ పట్టణంలోని ఉర్సుగుట్ట నాని గార్డెన్స్‌లో ఐనవోలు మండలం గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన గండి సదానందం కుమారుడు అఖిల్--స్వాతి వివాహ రిసెప్షన్ కార్యక్రమం ఘనంగా జరిగింది.కార్యక్రమానికి కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కరిమిల్ల సంపత్‌రావు, సంపత్ యాదవ్ తదితరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.



# కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తిరుగుడు వీరాస్వామికి మాతృవియోగం





**వీరాస్వామి తల్లి పార్థివ దేహానికి నివాళులర్పించిన మండల అధ్యక్షుడు సమ్మిగౌడ్**

**కేసముద్రం ప్రతినిధి, సెప్టెంబర్ 6,తరంగాలు :** మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిరుగుడు వీరాస్వామి తల్లి బక్కమ్మ అనారోగ్యంతో మృతి చెందడం తీవ్ర విచారకరమని కేసముద్రం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మి గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిరుగుడు వీరాస్వామి, కానిస్టేబుల్ శ్రీనివాస్ తల్లీ?బక్కమ్మ మృతి చెందిన విషయం అక్కడ ఉన్న నాయకులు,వార్డ్ సభ్యుల ద్వారా తెలుసుకున్న సమ్మి గౌడ్, ఆదివారం ఉప్పరపల్లిలోని ఆమె నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ సానుభూతిని తెలిపారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మిగౌడ్ మాట్లాడుతూకాంగ్రెస్ పార్టీ ప్రతి నాయకునికి కార్యకర్తకు అండగా ఉంటుందని తెలిపారు. సంతోషంలో కాదు బాధలో మీ భుజం తట్టి మీ పక్కన నిలబడతామని భరోసా ఇచ్చారు. గ్రామాలలో ఎవరికి ఏ కష్టం వచ్చిన సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు అందరు సమన్వయం చేసుకుంటూ బాధితులకు అండగా ఉండాలని సూచించారు. అందరు సంఘటితమై బాధలేని లోటును పూడ్చాలని పిలుపునిచ్చారు. కంటికి రెప్పలా ప్రతి ఒక్కరిని కాపాడుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు. సమ్మిగౌడ్ వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండారు దయాకర్,గ్రామ పార్టీ అధ్యక్షులు నూకల వెంకటేశ్వర్లు, వార్డు నెంబర్స్ కంచ రాజు, పలస పద్మా వెంకన్న, తండా సంపత్, యువత అధ్యక్షులు తండా శ్రీనివాస్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అరిగే విజేందర్, పబ్బతి సారంగం, అడప రమేష్, ఏటురోజు పరిపూర్ణ చారి,పబ్బతి శ్రీనివాస్,పలస నాగేష్,బట్టు మురళి, కంకల కొమురయ్య, ఆవుల బాబు, పబ్బతి శ్రీనివాస్,కంచ భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా.. ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్

- ప్రమాదంలో గాయపడిన శ్రీకాంత్‌కు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక చేయూత



**రాయపర్తి, సెప్టెంబర్ 6,తరంగాలు** : సేవే పరమో ధర్మం అనే లక్ష్యంతో బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తున్న ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ మరోసారి మానవతా దృక్పథాన్ని చాటుకుంది.మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడిని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.
రాయపర్తి మండలం బురాన్‌పల్లి గ్రామంలోని నాను తండాకు చెందిన బానోత్ శ్రీకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హనుమకొండలోని రోహిణి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి శ్రీకాంత్‌ను పరామర్శించారు. అనంతరం ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ తరఫున రూ.3,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల నాయకులు లేతకుల రంగారెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, చందు రాము, సర్పంచ్ ఇస్లావత్ సంతోష్, బొమ్మేనేని సురేందర్ రెడ్డి, సింగారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యపు ముసుగులో అసలు రాజకీయం..

**'ధర్మస్థల నియోజకవర్గం' సినిమా రివ్యూ**

**కథ**

ధర్మస్థల నియోజకవర్గంలో ఎలాంటి పోటీ లేకుండా వరుసగా ఎమ్మెల్యేగా గెలుస్తూ వస్తున్న బైరాజ్ (సాయికుమార్) అరాచకాలకు అడ్డులేకుండా పోతుంది. ప్రజలకు ఏమాత్రం మేలు చేయని ఆ నాయకుడి ఏకఛత్రాధిపత్యానికి, ఒక సాధారణ టీ షాపు నడుపుకునే ఈశ్వరయ్య (సుమన్) అనూహ్యంగా ఎదురునిలబడి రాజకీయంగా సవాల్ విసురుతాడు. అసలు ఆ రాజకీయ దిగ్గజంపై సాధారణ టీ కొట్టు వ్యక్తి ఎందుకు పోటీ చేయాల్సి వచ్చింది? ఈశ్వరయ్య కుమారుడు బద్రి (నటరాజ్) మృతికి దారితీసిన పరిస్థితులు ఏమిటి? కాలేజ్ లెక్చరర్ అరుంధతి (వితికా షేరు) సాగిస్తున్న ఒంటరి పోరాటం దేనికి సంకేతం? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే ఈ చిత్ర కథాంశం.

**విశ్లేషణ**

ఒక నియోజకవర్గంలో జరిగే రాజకీయ క్రీడను ఆధారంగా చేసుకుని, దేశం మొత్తానికి వర్తించేలా ఒక బలమైన సందేశాన్ని ఇవ్వడంలో చిత్ర యూనిట్ విజయం సాధించింది. నేటి యువతను డ్రగ్స్ ఏవిధంగా నాశనం చేస్తున్నాయి, రాజకీయ నాయకులు వాటిని ఎలా తమ లబ్ధికి వాడుకుంటున్నారు అనే కోణాలను చాలా స్పష్టంగా చూపించారు. వల్గారిటీకి తావు లేకుండా, కుటుంబమంతా కలిసి చూడదగ్గ ఒక మంచి పొలిటికల్ థ్రిల్లర్ ఇది. రాజకీయంలో నిజాయితీ ఉంటే ప్రజలు ఎంతగా ఆదరిస్తారనే అంశాన్ని హృద్యంగా ఆవిష్కరించారు.

# పేదల కళ్లలో వెలుగులు నింపడమే లక్ష్యం





- గంట రవికుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య, శస్త్రచికిత్స శిబిరానికి అనూహ్య స్పందన
- పేద ప్రజల సేవకే గంట రవికుమార్ ఫౌండేషన్ అంకితం
- -ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంట రవికుమార్
- 1,067 మందికి కంటి పరీక్షలు.. 722 మందికి ఉచిత కంటి అద్దాలు.. శస్త్రచికిత్స కోసం 42 మంది హైదరాబాద్‌కు తరలింపు

**వరంగల్ ప్రతినిధి , సెప్టెంబర్ 7, తరంగాలు** :పేదల కళ్లలో వెలుగులు నింపడమే లక్ష్యమని,పేద ప్రజల సేవకే గంట రవికుమార్ ఫౌండేషన్ అంకితమని ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంట రవికుమార్ అన్నారు.పేద ప్రజలకు అండగా నిలిచి, వారి ఆరోగ్య పరిరక్షణకు తనవంతు సహకారం అందించాలనే లక్ష్యంతో గంట రవికుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా వరంగల్ నగరంలోని శివనగర్‌లో ఉచిత కంటి వైద్య, శస్త్రచికిత్స శిబిరాన్ని నిర్వహించారు. శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో శివనగర్‌లోని కేపీఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ మెగా వైద్య శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది.ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంట రవికుమార్ మాట్లాడుతూ.. సమాజంలోని నిరుపేదలు, వెనుకబడిన వర్గాలకు అండగా నిలవడమే గంట రవికుమార్ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎంతోమంది పేదలు కంటి సమస్యలతో బాధపడుతున్నారని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రముఖ శంకర కంటి ఆసుపత్రి నిపుణులైన వైద్యుల సహకారంతో ఈ ఉచిత కంటి వైద్య, శస్త్రచికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

**కంటి పరీక్షల నుంచి శస్త్రచికిత్స వరకు ఉచిత సేవలు**

శిబిరంలో మొత్తం 1,067 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన 722 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. కంటి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించిన 42 మందిని తదుపరి చికిత్స, శస్త్రచికిత్సల కోసం హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు మందులు, ఇతర వైద్య సలహాలు అందించినట్లు గంట రవికుమార్ తెలిపారు.ఆరోగ్యకరమైన చూపు మనిషి జీవితానికి అత్యంత ముఖ్యమని, కంటి చూపు సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పేదలకు ఆర్థిక భారం లేకుండా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన పేర్కొన్నారు. "అక్షరాల వెలుగుల నుండి.. ఆనందాల కంటి చూపు దాకా.. నిరుపేదల నీడగా గంట రవికుమార్ ఫౌండేషన్" అనే సేవా లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

**విద్యార్థులకు సైతం ఫౌండేషన్ అండ**

గంట రవికుమార్ ఫౌండేషన్ ద్వారా గతంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా గంట రవికుమార్ గుర్తుచేశారు. పేద విద్యార్థులు ఆర్థిక కారణాలతో చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో విద్యార్థులకు ఉచిత ట్యూషన్ సౌకర్యం, ట్యూషన్ ఫీజుల సహాయం అందించినట్లు తెలిపారు. పదో తరగతి చదువుతున్న నిరుపేద విద్యార్థులకు ఎగ్జామ్ ఫీజులు సైతం చెల్లించి వారి విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించామని చెప్పారు.విద్యా సేవలతో పాటు నిరుపేద ప్రజల ఆకలి తీర్చడం, వైద్య సహాయం అందించడం తదితర అనేక సామాజిక సేవా కార్యక్రమాలను ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజలకు మరింత ఉపయోగపడే విధంగా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామని గంట రవికుమార్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందంతో పాటు బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.స్థానిక బీజేపీ నాయకులు బైరి శ్యాంసుందర్, మార్త ఉషారాణి, వైట్ల గణేష్, తాళ్లపెల్లి శ్రీను, సుంచు కేశవ్, మాదాసు రాజు, శివశంకర్, సూరజ్, స్రవంతి, సాగరిక, రమేష్, పి ఎల్ వి ఎన్ శ్రీను, కల్పన తదితరులు పాల్గొన్నారు.అలాగే గంట రవికుమార్ ఫౌండేషన్ సభ్యులు పోశాల సతీష్, కందుకూరి విజయ్ కుమార్, శ్రీనివాస్, సురేష్, విక్రమ్ గౌడ్, సునీల్, వేణు, రాజు, శ్రీకాంత్, రంజిత్, సందీప్, శ్రవణ్, రాజ్ కుమార్, నాగరాజు, వెంకట్, రాజు, భాస్కర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.బీజేపీ జిల్లా నాయకులు కనుకుంట్ల రంజిత్, బైరి నాగరాజు, కర్నె రవీందర్, అనిల్ గోగికర్, గోకే వెంకటేష్, అంకాల జనార్ధన్, అనిల్ షేర్ల, ముద్దసాని కృష్ణ, హనుమంతు, సతీష్, బండి సుజాత, స్వర్ణజ, స్వరూప తదితరులు కార్యక్రమంలో పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.





# మద్యం మత్తులో ఖాకీపై దాడి




- వర్ధన్నపేటలో నలుగురు యువకుల వీరంగం
- ప్రభుత్వ ఫోన్ ధ్వంసం.. కానిస్టేబుల్‌పై దాడి
- డ్యూటీలో ఉన్న పోలీసుపైనే దాడి చేస్తే.. సామాన్యుడి పరిస్థితి ఏంటి?

### ఘటనపై తీవ్ర ఆగ్రహం

వర్ధన్నపేట ప్రతినిధి, సెప్టెంబర్ 6,తరంగాలు : మద్యం మత్తు విచక్షణను కోల్పోయేలా చేస్తుందనడానికి వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో చోటుచేసుకున్న ఘటన మరో ఉదాహరణగా నిలిచింది. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు కానిస్టేబుల్‌పైనే నలుగురు యువకులు దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో పట్టణంలో తీవ్ర చర్చకు దారితీసింది.స్థానికుల వివరాల ప్రకారం.. శనివారం రాత్రి వర్ధన్నపేట పట్టణంలోని హేమ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద వర్ధన్నపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు మద్యం సేవిస్తుండగా, పక్క టేబుల్‌లో ఉన్న తాళ్లకుంట తండాకు చెందిన నవీన్, రవీందర్, ఈశ్వర్, చందులాల్తో వివాదం తలెత్తింది. మాటామాటా పెరగడంతో నలుగురు కలిసి ఇద్దరిపై దాడి చేసినట్లు సమాచారం.విషయం పోలీసులకు తెలియడంతో కానిస్టేబుల్ తౌటి రాజేష్ అక్కడికి చేరుకుని గొడవను అడ్డుకున్నారు. బాధితులను ఆస్పత్రికి తరలించి, అనంతరం పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు.అయితే పరిస్థితి అక్కడితో సద్దుమణగలేదు. “మమ్మల్ని వీడియో తీస్తావా?” అంటూ నలుగురు కానిస్టేబుల్‌తో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఈ క్రమంలో ప్రభుత్వానికి చెందిన ఫోన్‌ను ధ్వంసం చేయడంతో పాటు, కానిస్టేబుల్ వద్ద ఉన్న సెల్‌ఫోన్లను లాక్కొని నేలకేసి కొట్టి పగలగొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఇంతటితో ఆగకుండా విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో కానిస్టేబుల్ రాజేష్‌ను కింద పడవేసి దాడి చేసినట్లు తెలుస్తోంది. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపైనే ఈ స్థాయిలో దాడి జరగడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయి బాబు తెలిపారు.

### సమాజం ఎటువైపు వెళుతోంది?

మద్యం సేవించడం వ్యక్తిగత విషయం కావచ్చు. కానీ మద్యం మత్తులో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, విధులు నిర్వహిస్తున్న పోలీసుపైనే దాడి చేయడం ఎంతవరకు సమంజసం? అన్న ప్రశ్న ఇప్పుడు ప్రజల్లో తలెత్తుతోంది. ప్రజల రక్షణ కోసం రాత్రింబవళ్లు విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికే భద్రత లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటనే ఆందోళన వ్యక్తమవుతోంది.
దీనికి కారణం ఎవరు?
మద్యం మత్తులో యువత ప్రవర్తన అదుపుతప్పడానికి కారణాలపై కూడా సమగ్రంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. బార్‌లు, మద్యం విక్రయ కేంద్రాల వద్ద గొడవలు, హింసాత్మక ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత శాఖలు కఠిన నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.

### కఠిన చర్యలే పరిష్కారం!

విధుల్లో ఉన్న పోలీసుపై దాడి, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం వంటి ఘటనలను తేలికగా తీసుకోకుండా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి చర్యలకు పాల్పడితే శిక్ష తప్పదనే స్పష్టమైన సందేశం వెళ్లేలా పోలీసులు చర్యలు చేపట్టాలి.అదే సమయంలో మద్యం సేవించే వారి ప్రవర్తనపై అవగాహన కల్పించడం, బార్‌ల వద్ద భద్రతా చర్యలను పెంచడం, సీసీ కెమెరాల పర్యవేక్షణను పటిష్టం చేయడం వంటి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.ఖాకీపై చేయి చేసుకునే ధైర్యం పెరిగితే.. రేపు చట్టంపై గౌరవం ఎక్కడ మిగులుతుంది?వర్ధన్నపేట ఘటనకు బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు శాఖ స్పష్టమైన హెచ్చరిక ఇవ్వాల్సిన అవసరం ఉంది.

# గురువుల సేవలకు రోటరీ క్లబ్ ఘన సత్కారం

### టీచర్స్ డే సందర్భంగా 11 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 6,తరంగాలు : టీచర్స్ డే సందర్భంగా అంకితభావం, నిబద్ధతతో సేవలందిస్తున్న 11 మంది ఉత్తమ ఉపాధ్యాయులను రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. హంటర్ రోడ్‌లోని పిఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు సోమ వేణు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, ప్రశంసాపత్రాలు అందజేశారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ నిర్మాణంలో వారి సేవలు అమూల్యమని కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యాబోధనతో పాటు విద్యార్థుల్లో విలువలు, క్రమశిక్షణ, బాధ్యత, మానవతా భావాలను పెంపొందిస్తున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పొన్న హరినాథ్, తోట సంపత్, బేతిశంకర్ దేవ, మహేందర్, కోరే చంద్ర, మొగిలి శ్రీనివాస్ తదితర రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఇషాన్ సెంచరీ.. ఈస్ట్ జోన్ 385/4

### మెరిసిన అభిమన్యు, సూర్యవంశీ

చెన్నై: కెప్టెన్ ఇషాన్ కిషన్ (135 బంతుల్లో 14 ఫోర్లు, 1 సిక్స్‌తో 111 బ్యాటింగ్) అజేయ శతకంతో కదం తొక్కడంతో దులీప్ ట్రోఫీ ఫైనల్ పోరులో ఈస్ట్ జోన్ తొలి రోజే భారీ స్కోరు సాధించి పట్టు బిగించింది. ఆదివారం మొదలైన ఈ మ్యాచ్‌లో తిలక్ వర్మ కెప్టెన్సీలోని సౌత్ జోన్ పేలవ బౌలింగ్‌ను ఆసరాగా చేసుకున్న ఈస్ట్ జోన్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల నష్టానికి 385 పరుగులు చేసింది. శిఖర్ మోహన్ (85), అభిమన్యు ఈశ్వరన్ (72), కుమార్ కుశాగ్ర (63 బ్యాటింగ్), వైభవ్ సూర్యవంశీ (37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 44) కూడా రాణించారు.
టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ జోన్‌కు ఓపెనర్లు అభిమన్యు, సూర్యవంశీ తొలి వికెట్‌కు 14 ఓవర్లలోనే వంద పరుగులు జోడించి అద్భుత ఆరంభం అందించారు. ఉన్నంతసేపు మంచి షాట్లతో ఆకట్టుకున్న యంగ్ సెన్సేషన్ తన ఆట చూసేందుకు వచ్చిన ఫ్యాన్స్‌ను ఖుషీ చేశాడు. మరోవైపు సౌత్ బౌలర్లలో హైదరాబాదీ సీవీ మిలింద్ (2/56) ఒక్కడే రెండు వికెట్లతో రాణించగా మిగతా వాళ్లు నిరాశపరిచాడు. మరో హైదరాబాదీ మహ్మద్ సిరాజ్ (0/96) భారీగా పరుగులు ఇచ్చుకున్నాడు. కాగా, ఈస్ట్ జోన్‌కు ఆడుతున్న వెటరన్ పేసర్ మహ్మద్ షమీ, సౌత్ జోన్ బౌలర్ శ్రేయస్ గోపాల్ ఈ పోరుతో 100 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల మైలురాయిని అందుకున్నారు.



### తిలక్ సూర్యవంశీ

తొలి సెషన్‌లో ఈస్ట్ జోన్ వైస్ కెప్టెన్ సూర్యవంశీ, సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ మధ్య నడిచిన ఆన్-ఫీల్డ్ డ్రామా తీవ్ర ఆసక్తి రేపింది. ఇన్నింగ్స్ ఆరంభంలోనే సిరాజ్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్‌తో విరుచుకుపడ్డ సూర్యవంశీ దృష్టి మళ్లించేందుకు తిలక్ స్లెడ్జింగ్, మైండ్‌గేమ్ ప్రారంభించాడు. క్రీజులో ఉన్న సూర్యవంశీని ఉద్దేశించి ‘క్యా యార్ యే వైస్ కెప్టెన్’ (ఏంటయ్య ఈ వైస్ కెప్టెన్) అంటూ వ్యంగ్యంగా చేసిన వ్యాఖ్యలు స్టంప్ మైక్‌లో రికార్డయ్యాయి. కొద్దిసేపటికే సూర్యవంశీ..మిలింద్ బౌలింగ్‌లో పుల్ షాట్ ఆడి క్యాచ్ ఔటయ్యాడు.

## ధోనీ ఇలాకాలో అగార్కర్.. వైభవ్ కోసమే వచ్చాడా..!



భారత క్రికెట్ నియంత్రణ మండలి (దీజజ×)సమీక్షా సమావేశానికి డుమ్మా కొట్టిన చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ (ూాయఒ ాూస్త్రుతీఝుతీ) చెన్నైలో మీడియా కంటపడ్డాడు. రివ్యూ మీటింగ్‌కు హాజరు కానుందున ‘అగార్కర్ పదవీకాలం ముగిసిందా?’, ‘అగార్కర్ ఎక్కడ?’ అంటూ వదంతులు ప్రచారమవుతున్న వేళ.. ఎట్టకేలకు మూడు రోజులకు చెపాక్ స్టేడియంలో కెమెరాకు చిక్కాడు అగార్కర్. ఎంఎస్ ధోనీ (మీా ఐష్ట్రశీఅఱ) ప్రాతినిధ్యం వహిస్తున్న చెన్నై సూపర్ కింగ్స్ సొంత మైదానంలో ఆదివారం దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించాడు చీఫ్ సెలెక్టర్. చీఫ్ సెలెక్టర్ పదవికి రోజులు దగ్గరపడుతున్న వేళ బీసీసీఐ రివ్యూ మీటింగ్‌కు అజిత్ అగార్కర్ హాజరవ్వకపోవడం పలు అనుమానాలకు తావిచ్చింది. వచ్చే వన్డే వరల్డ్‌కప్ వరకైనా అగార్కర్‌ను కొనసాగిస్తారా? అసలు అతడు ఎందుకు డుమ్మా కొట్టాడు?అని తలోరకంగా చర్చించుకున్నారు. సమీక్షా సమావేశం ముగిసిన మూడు రోజుల అనంతరం ఊహాగా నాలకు తెరదించుతూ చెపాక్ స్టేడియంలో కనిపించాడు అగార్కర్. చిదంబరం స్టేడియం స్టాండ్స్‌లో రిలాక్స్‌గా కూర్చొని.. ఆదివారం ఈస్ట్ జోన్, సౌత్ జోన్ మధ్య మొదలైన దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ చూశాడీ మాజీ క్రికెటర్. దాంతో.. యువకెరటం వైభవ్ సూర్యవంశీ ఆట చూసేందుకు వచ్చాడా? అని అభిమానులు అనుకుంటున్నారు.

### సెప్టెంబర్‌తో ఆఖరు

బీసీసీఐ సమీక్ష సమావేశం అనంతరం ‘అగార్కర్ ఎందుకు పాల్గొనలేదు?’ అని మీడియా సెక్రటరీ దేవజిత్ సైకియాను చుట్టిముట్టింది. దాంతో.. ‘అగార్కర్ వేరే చోట ఉన్నారు. స్వల్ప వ్యవధిలోనే సమావేశాన్ని ఖరారు చేసినందున అతడు హాజరుకాలేదు. అజిత్ ఉన్న ప్రాంతంలో ఇంటర్నెట్ సేవలు కూడా లేనందున అతడు ఆన్‌లైన్‌లో కూడా మీటింగ్‌లో పాల్గొనలేదు. అతడిని కొనసాగించడం గురించి ఈరోజు చర్చించలేదు. సెలెక్షన్ కమిటీ గురించిన చర్చే రాలేదు. ఇంగ్లండ్, ఐర్లాండ్ పర్యటనలో భారత జట్టు ప్రదర్శన గురించి, ఇటీవలే ముగిసిన శ్రీలంక టెస్టు సిరీస్ మీద మాత్రమే దృష్టి సారించాం. తదుపరి సిరీస్‌లు, ప్రపంచకప్ కోసం ఎలా సన్నద్ధమవ్వాలి? అనే విషయాల గురించే మాట్లాడుకున్నాం’ అని సైకియా పేర్కొన్నాడు. 2023, జులై 4వ తేదీన చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అగార్కర్ పదవీ కాలం ఈ సెప్టెంబర్‌లోనే ముగియనుంది. దాంతో.. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ వరకు అతడిని కొనసాగిస్తారా? కొత్తవాళ్లను నియమిస్తారా? అనేది తెలియాల్సి ఉంది.

## వైభవ్ వీరకొట్టుడు.. సిరాజ్ మళ్లీ బలయ్యాడుగా..!




భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరోసారి విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. ఇప్పటివరకూ వన్డే, టీ20ల్లో మెరుపు బ్యాటింగ్‌తో అలరించిన ఈ చిచ్చరపిడుగు.. ఈసారి ఎర్ర బంతిపైనా పగబట్టినట్టే ఆడాడు. వైభవ్ బౌండరీలతో విరుచుకుపడగా టీమిండియా సీనియర్ పేసర్ మహమ్మద్ సిరాజ్ బిత్తరపోయాడు. ఐపీఎల్ అరంగేట్రం సీజన్‌లో సిరాజ్ ఓవర్లో ఎడాపెడా దంచేసిన ఈ కుర్రాడు ఇప్పుడు దులీప్ ట్రోఫీ ఫైనల్లోనూ చుక్కలు చూపించాడు. ‘బౌలర్ ఎంతటివాడైనా నాకేంటీ.. నా స్టయిల్ ఇంతే’ అన్నట్టుగా చెలరేగే వైభవ్ సూర్యవంశీ మరో ఖతర్నాక్ ఇన్నింగ్స్ ఆడాడు. దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ ఓపెనర్‌గా ఆడుతున్న వైభవ్ ఫైనల్లో దంచేశాడు. సౌత్ జోన్ బౌలర్లను హడలెత్తించిన ఈ పదిహేనేళ్ల కుర్రాడు.. సిరాజ్ బౌలింగ్‌లోనూ చితక్కొట్టాడు. సీనియర్ పేసర్ అయిన అతడి ఓవర్లో వరసగా 4, 6.. చివరి బంతికి బౌండరీతో రెచ్చిపోయాడీ బ్యాటింగ్ సంచలనం. దాంతో, ఐపీఎల్ 18వ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ పేసర్‌గా ఆడిన సిరాజ్‌కు చుక్కలు చూపించిన వైభవ్.. ఇప్పుడు దులీప్ ట్రోఫీలోనూ పైచేయి సాధించాడు.

## చైనాలో చరిత్ర

షెన్‌జెన్ (చైనా): భారత బ్యాడ్మింటన్ ‘డబుల్లెట్స్’ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి మరో అరుదైన ఘనత అందుకున్నారు. మన దేశ డబుల్స్ షట్లర్లకు అందని ద్రాక్షగా ఉన్న బీడబ్ల్యూఎఫ్ చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నమెంట్‌లో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. మెగా టోర్నీ డబుల్స్ టైటిల్ సొంతం చేసుకొని ఈ ఘనత సాధించిన భారత తొలి జోడీగా రికార్డు సృష్టించారు. ఆదివారం హోరాహోరీగా సాగిన తుదిపోరులో ప్రపంచ 5వ ర్యాంక్ ద్వయం సాత్విక్ -- చిరాగ్ 11-21, 21-13, 21-17తో చైనాకు చెందిన హే జి టింగ్-రెన్ జియాంగ్ యుపై అద్భుత విజయం సాధించింది. గంటా 10 నిమిషాల పాటు సాగిన పోరులో తొలి గేమ్ కోల్పోయినప్పటికీ అద్భుతంగా పుంజుకొని గెలిచింది. 2023, 2025లోనూ ఫైనల్ చేరినా అందుకోలేకపోయిన చైనా టైటిల్‌ను మూడో ప్రయత్నంలో సగర్వంగా ఒడిసిపట్టుకుంది. ఈ విజయంతో చైనా జంటపై తమ ముఖాముఖి రికార్డును 3-0కు పెంచుకుంది.